ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 22 మార్చి, 2025 | పేజీలు : 06




పోచంపల్లి మండలంలో 'బర్డ్ ఫ్లూ'

# నీటికి నడక నేర్పేది.. వాటర్ షెడ్ ప్రోగ్రాం



## రాష్ట్రంలో పుట్టపాక నుండి వాటర్ షెడ్ యాత్ర ప్రారంభం

### యాదాద్రిభువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం:** నీటికి నడక నేర్పే కార్యక్రమమే వాటర్ షెడ్ కార్యక్రమం అని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల, రెవెన్యూ జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామం నుండి శుక్రవారం వాటర్ షెడ్ యాత్రను ప్రారంభించారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన లో భాగంగా వాటర్ షెడ్ యాత్రను వాటర్ షెడ్ జాయింట్ కమిషనర్ నరసింహులు తో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ వీరా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వాటర్ షెడ్ కార్యక్రమం రూపొందించబడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వర్ష పాతం మీదనే ఆధారపడి వ్యవసాయం చేయడం తోనే వ్యవసాయం చేసే వారి సంఖ్య తగ్గుతూ వస్తుందని అన్నారు. వర్షాలు పడ్డప్పుడు నీటిని ఒడిసి పట్టి వర్షపాతం లేని సమయంలో బాధ్యతగా వాడడంతో భూగర్భ జలాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఫర్ ఏ డ్రాప్ మోర్ క్రాప్ అనే నినాదంతో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం మొదలు పెట్టిందని తెలిపారు. రైతును మించిన శాస్త్రవేత్త లేడని నూతన విధానాలను పాటిస్తూ వ్యవసాయంలో కొత్త ప్రయోగాలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రజలందరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు వాటర్ షెడ్ జాయింట్ కమిషనర్ నరసింహులు మాట్లాడుతూ... నీటిని పద్ధతిగా వాడితే కరువును పారద్రోలవచ్చని ఐదు సంవత్సరాలలో సంస్థాన్ నారాయణపురం మండలాన్ని కరువు రహిత మండలంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. రాష్ట్రంలో వర్షాపాతం 914 మిల్లీ మీటర్లు కాగా సంస్థాన్ నారాయణపురం మండలంలో 540 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదు అయిందని వెల్లడించారు. అనంతరం గ్రామంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించి మొక్కలను నాటారు. అదేవిధంగా వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా 6 లక్షల రూపాయల పైచిలుకు వ్యయంతో చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ నాగిరెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారిణి పద్మజా రాణి, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి జ్యోతి కుమార్, స్థానిక తహసీల్దార్ ఎం.కృష్ణ,ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంపీఓ నరసింహారావు, వ్యవసాయ అధికారిణి వర్షిత, ఏపీఎం యాదయ్య, ఏపీవో ప్రశాంతి, వాటర్ షెడ్ సభ్యులు పాల్గొన్నారు.



## రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఈనెల 23న చింతపల్లి మండల కేంద్రంలో జరుగు నల్లగొండ జిల్లా రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కోశాధికారి బుర్ శేఖర్ రైతాంగాన్ని కోరారు. శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలో పార్టీ ఆఫీసులో విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు. ఎన్నికల సమయం లో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా 2లక్షల రుణమాఫీని రైతులందరికీ చేయాలని అన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులు అకౌంట్లో జమ చేయాలని అన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి బ్యాంకుల ద్వారా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ నెల 23 న చింతపల్లి మండలంలో జరిగే జిల్లా మహాసభలతో పాటు 26, 27 తేదీలలో నిజామాబాద్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట మహాసభలకు మర్రిగూడ మండల రైతాంగం తరలివెల్లి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షులు అల్వాల నరసింహ ,మండల కోశాధికారి అబ్బనగోని కృష్ణయ్య, బొల్లం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కేంద్రాలలో అన్ని సౌకర్యాలు

### నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

**ప్రజాపక్షం/ నల్లగొండ :** రబీ ధాన్యం సేకరణ కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, చైర్మెన్లకు రబీ ధాన్యం సేకరణ , మద్దతు ధర పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా రబీ ధాన్యం సేకరణ చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అన్ని కేంద్రాలలో ధాన్యం తూర్పారబట్టే యంత్రాలు, తూకం వేసేయంత్రాలు,తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీరు, టెంట్, ఫ్లక్సీ ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్న విషయాన్ని తెలియజేయాలని చెప్పారు. సన్న ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలని, దొడ్డు ధాన్యానికి వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లో ధాన్యం అమ్మిన మొత్తం వారి బ్యాంకు ఖాతాలలో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకు గాను ఓబిఎమ్ఎస్, ట్రక్ షీట్లను వెంటనే జనరేట్ చేసే విధంగా చూడాలని అన్నారు.డి సి సి బి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,డి సి ఎం ఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ హరీష్,జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయా దేవి, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.




## తప్పుడు పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా : ఎస్‌పి

**ప్రజా పక్షం /నల్లగొండ టౌన్ :** కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవుని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు.శుక్రవారం నల్లగొండ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఉగాది,రంజాన్ పండుగ సందర్భంగా కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే వారిపై నిరంతరం సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షిస్తున్నమని జిల్లా తెలిపారు.ఎవరైన సామాజిక మాధ్యమాల్లో వాట్స్ అప్,ఫేస్బుక్,ట్విట్టర్, ఇన్స్టాగ్రాం, యూ ట్యూబ్, మొదలగు వాటిని వేదికగా చేసుకుని ఇతర కులాల పట్ల ,మతాల పట్ల, వ్యక్తుల పట్ల అనుచిత వ్యాఖ్యలు,విద్వేష పూరితమైన పోస్ట్ లు, వుద్వేష పూరిత ప్రసంగాలు, రెచ్చ గొట్టే విధంగా పోస్ట్ లు,అసత్య ప్రచారాలు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో తప్పుడు పోస్టులు పెడితే తగిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, ప్రజలు ఎవ్వరు నమ్మవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకోని తప్పుడు, విద్వేషకర పోస్టులు చేసిన, షేర్ చేసినా వారి సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్ కి తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

## టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

### పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ కె.నర్సింహ్మా




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ పటిష్ట బందోబస్తు ఉండాలని, పరీక్షా సమయంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్ధవంతంగా నియంత్రించాలని జిల్లా ఎస్పీ కె.నర్సింహా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జడ్పి బాలికల సెంటర్, అంజలిస్కూల్ సెంటర్‌లో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎక్కడ లోపాలు జరగకుండా పోలీసులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, ఎవ్వరు కూడా అవకతవకలకు పాల్పడవద్దని కోరారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు రావాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదన్నారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐ ప్రవీణ్ ఉన్నారు.

## గుండ్రాంపల్లిలో బర్డ్‌ఫ్లూ కలకలం

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో గల ఒక కోళ్ళ పరిశ్రమలోని కోళ్ళకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన ఘటన కలకలం సృష్టించింది. గుండ్రాంపల్లి, ఏపూర్ గ్రామాల మధ్య కోడిగుడ్ల ఉత్పత్తి కోసం నెలకొల్పిన ఒక కోళ్ళ పరిశ్రమలో సుమారు 1లక్ష37వేల కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకినట్లుగా అధికారులు నిర్ధారించినట్లుగా తెలుస్తుంది. శుక్రవారం రోజున రాష్ట్ర, జిల్లా యంత్రాంగం బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లలో పాక్షికంగా సమీపంలోని వాగులో గోతి తీసి పాతిపెట్టినట్లు తెలుస్తుంది. పూర్తి సమాచారం కోసం ప్రయత్నించగా సంభందిత అధికారులు అందుబాటులోకి రావడం లేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కేంద్ర మంత్రికి వినతి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామ సమీపాన ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన పరిశోధన కేంద్రంను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఆధీనంలో రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపిటిసి చెన్నగోని శివగౌడ్ శుక్రవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/ తిరుమలగిరి సాగర్ :** మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన తాపీ మేస్త్ర రమావత్ లచ్చు నాయక్ ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందగా అట్టి విషయాన్ని తెలుసుకున్న పగడాల సైదులు యాదవ్ వారి కుటుంబాన్ని పరామర్శించి భార్య కమ్లి ,కూతురు తుల్జా ,పప్పీలను ఓదార్చి లచ్చు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. యువకులు గోపాల్‌నాయక్, తిరుమలగిరి సాగర్ మెస్త్రీల అధ్యక్షుడు హనుము నాయక్ , సర్దార్ నాయక్ , నరేష్ నాయక్ పాల్గొన్నారు.

## వందశాతం హాజరైన 'పది' విద్యార్థులు

**ప్రజాపక్షం/చిట్యాలః** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుండి నిర్వహించబడుతున్న పదవ తరగతి పరీక్షలు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.వార్షిక పరీక్షలకు వంద శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రారంభమయిన దగ్గరి నుండి పూర్తి అయ్యేంత వరకు విద్యార్థులకు ఎలాంటి పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రీన్ గ్రోవ్, న్యూలిటిల్ ఫ్లవర్ హైస్కూల్ సెంటర్‌లలో పరీక్షలు వ్రాస్తున్న మొత్తం 433 మంది విద్యార్థులు మొదటి రోజు తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను స్థానిక ఎంఈఓ పి సైదానాయక్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



## బిసి, ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఆమోదం అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** భారతదేశంలో ఎక్కడ లేని విధంగా బిసి, ఎస్సీ వర్గకీరణ బిల్లుకు శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సూచనల మేరకు పట్టణ అధ్యక్షులు బొడ్డుసాయి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సి, ఎస్టీ, బిసిలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం అభినందనీయమన్నారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచడం హర్షనీయమన్నారు. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, రుద్రంగి రవి, కరీముల్లాబేగ్, అనంతుల యాదగిరి, వాసు, అలేటి మాణిక్యం, అయూబ్‌ఖాన్, సిరివెళ్ల శభరినాథ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిలుకూరు ఎస్ఐ రాంబాబు అన్నారు. శుక్రవారం చిలుకూరు మండల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో షీటీమ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె.నర్సింహా అదేశాల మేరకు జిల్లాలో గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా విద్యార్థులు, యువత తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దని, ఎటిఎం, ఓటిపి వివరాలు తెలపవద్దని సూచించారు. యువత అతివేగంగా ప్రయాణించవద్దని, ఆడపిల్లలు మహిళలు ఆకతాయిల వేదింపులకు గురిచేస్తే 100 కాల్‌కు, లేదా షీటీమ్ నెంబర్ 87126 86056 ఫిర్యాదు చేయవచ్చునని కోరారు. అనంతరం పోలీస్ కళాబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, పోలీస్ సిబ్బంది జ్యోతి, సాయి జ్యోతి, వెంకటేశ్వర్లు, యల్లయ్య, గోపయ్య, చారి తదితరులు పాల్గొన్నారు.

## రజకుల సంక్షేమానికి బడ్జెట్ పెంచాలి

**ప్రజాపక్షం/అనంతగిరి:** రాష్ట్రంలో సుమారుగా ఐదు లక్షల కుటుంబాలు రజక వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, నేటికి గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తి ఆధారంగా బ్రతికే కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయని, ప్రభుత్వం సంక్షేమానికి మరింత బడ్జెట్ పెంచి కేటాయింపులను సవరణ చేసి రజకుల సంక్షేమానికి వేయి కోట్లు కేటాయించాలని రజక సంఘం సామాజిక కార్యకర్త గరిడేపల్లి రాము అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 22526 సంవత్సరంలో బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి 200కోట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేశారని, ఉచిత విద్యుత్ 150కోట్లు, సంక్షేమ మోడ్రన్ ధోభిఘాట్ల నిర్మాణానికి 50 కోట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 4000రజక సహకార సంఘాలు ఏర్పాటు చేసి ఉన్నాయని వాటన్నిటికి రుణాలు ఇవ్వాలని కోరారు. వృత్తిదారులకు ఇచ్చే బడ్జెట్‌ను పెంచాలని, వృత్తి పనిలో వృద్దులకు ప్రత్యేక పెన్షన్ స్కీం ఏర్పాటు చేయాలని,సామాజిక దాడులు, దౌర్జన్యాలు అరికట్టేందకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన పది తొలిరోజు పరీక్ష

### 99.82 శాతం విద్యార్థుల హాజరు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలో పదవ తరగతి తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. మొత్తం 11 సెంటర్లలో 2343 మందికి గానూ 2339 మంది హాజరైనట్లు కేవలం నలుగురు విద్యార్థులే గైర్హాజరైనట్లు తెలిపారు. సెంటర్ల వారిగా తేజ స్కూల్‌లో 153 మందికి 153 మంది హాజరు, బాలుర ఉన్నత పాఠశాల 234 మందికి 234 మంది, శ్రీచైతన్య శ్రీనగర్ కాలనీ 198 మందికి 198మంది, సైదయ్యస్కూల్ 231 మందికి 230 మంది, సిటి సెంట్రల్ 227 మందికి 227, కెటిఎస్ పాఠశాల 240 మందికి 240 మంది, సిసిరెడ్డి 239 మందికి 239 మంది, ఎస్ఆర్ఎం పాఠశాల 167 మందికి 166 మంది, బాలికల ఉన్నత పాఠశాల 239 మందికి 238 మంది, శ్రీవైష్ణవి పాఠశాల 240 మందికి 240 మంది హాజరైనట్లు తెలిపారు. మొత్తం మీద 99.82 శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ప్రతి సెంటర్‌లో సెట్టింగ్స్ స్క్వాడ్లను నియమించామని అన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.





## కోదాడలో ఘనంగా నాభిశిల బొడ్రాయి ఏడవ వార్షికోత్సవం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని గ్రామదేవత నాభిశిల బొడ్రాయి ఏడవ వార్షికోత్సవం శుక్రవారం కమిటి సభ్యులు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణాల నడుమ పూజ కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బిందెలతో జలాభిషేకం జరిపి బొనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కోదాడ డిఎస్పీ శ్రీధర్‌రెడ్డి బొడ్రాయి వద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావుశ్రీదేవి దంపతులు పీటలపై కూర్చోని బొడ్రాయి వద్ద పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో బొడ్రాయి వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బొడ్రాయి పునఃప్రతిష్ట కమిటి సభ్యులు, రైతు కమిటి సభ్యులు, ముత్యాలమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ బోర్డ్ పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/మునగాల:** సిఐటియు ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని ఇందిరపార్కు వద్ద జరుగు మహాధర్నాకు భవన నిర్మాణ, హమాలి, ట్రాన్స్‌పోర్టు, బిడి వంటి అసంఘటిత రంగ కార్మికులు సామాజిక భద్రత, వేల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని చేపట్టిన ధర్నాకు పోలీసులు సిపిఎం నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరైంది కాదని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం అన్నారు. శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వేల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, వేల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం హామి ప్రకారం ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి 12వేలు ఇవ్వాలని, అడ్డాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ దస్తగిరి, షేక్ సైదా, జాన్‌పాషా, బచ్చలకూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కోదాడరూరల్:** జిల్లాల్లో పశువులకు, మేకలకు, గొర్రెలకు సోకే వ్యాధులను ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదిస్తే మంచి వైద్యం అందిస్తారని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్లకుంట గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులు సోకితే వెంటనే పశువైద్యులను కలిసి పశువులకు మందులు వేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బషీర్, మార్కెట్ కమిటి కార్యదర్శి బిపి రాహుల్, డైరెక్టర్లు కునుకుంట్ల శ్రీనివాసరావు, రాపాని శ్రీను, పశువైద్యులు సురేంద్ర, మధు, సిబ్బంది శ్రీను, ప్రసాద్, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టులను ఖండించండి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పోరాటాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకుల అక్రమ అరెస్టులను ఖండించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి పగడాల శివ పిలుపునిచ్చారు. విద్య రంగానికి 7.57 శాతం నిధులు కేటాయించడం విద్య రంగాన్ని అవమానించడమేనని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలనీ యూనివర్సిటీల అభివృద్ధి కోసం వెయ్యి కోట్లు కేటాయించాలని వంటి డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పిడిఎస్యు రాష్ట్ర కమిటీ నిర్వహిస్తుంటే శుక్రవారం అక్రమంగా తెల్లవారుజామున అరెస్టు చేయడం కాంగ్రెస్ యొక్క చేతకాని విధానానికి నిదర్శనమని విమర్శించారు. మండల నాయకులు పోతగల నరసింహ ఆయనతోపాటు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండలంలోని పల్లేర్ల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన 15 లక్షల నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను జెడ్పిటిసి నరేందర్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో రోడ్డు పనులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ సోలుపురం మల్లారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ తండ నరసింహ గౌడ్, సోలిపురం నరసింహారెడ్డి, పెద్దగాన వెంకన్న, సామ నల్లారెడ్డి, వస్తుపుల ఎల్లయ్య, ముద్దసాని వెంకష్, బండి ఐలయ్య, అంబోజు మల్లేష్, లోడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/ఆత్మకూరు(యం) :** మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపం లో వేసవికాలం దృష్టిలో ఉంచుకొని 10వ తరగతి పరిక్ష రాస్తున్న విద్యార్థులకు, ప్రజలకు దాహం తీర్చడం కోసం చలి వేంద్రాన్ని కేహెచ్ ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరీదీప్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్, స్థానిక తాజా మాజీ ఎంపిటిసి యాస కవిత ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోరె భిక్షపతి, మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, ఆత్మకూరు గ్రామ శాఖ అధ్యక్షులు కోరె వెంకన్న, కోరటికల్ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్, బీఆరెస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి.అజిమొద్దిన్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కొండపల్లి అబ్బసాయిలు, బీఆరెస్వి పట్టణ అధ్యక్షులు గడ్డం సతీష్ గౌడ్ పాల్గొన్నారు.



# వ్యవసాయ రంగానికి కేటాయింపులేవి?



**ప్రజాపక్షం/చిట్యాలః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులలో వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపులు జరపలేదని రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో సిపిఎం, రైతు సంఘ నాయకులతో కలిసి ఎండిపోయిన వరి పొలాలలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడి విత్తనోత్పత్తి రంగానికి, ప్రకృతి వైపరిత్యాలు, వడగండ్ల వానల వల్ల నష్టపోయే రైతులను ఆదుకోవడానికి కూడా బడ్జెట్‌లో చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటి సభ్యులు అరూరి శ్రీను, మండల కమిటి అధ్యక్షులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు మెట్టు నర్సింహ్మా, మెట్టు పరమేష్, మల్లేష్, బాతరాజు లాలు, సింగిరెడ్డి యాదిరెడ్డి, క్రిష్ణారెడ్డి, జక్కల లక్ష్మయ్య, బాతరాజు ఇస్తారి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చిట్యాలః** భారత కరెన్సీపై రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని ముద్రింపచేయాలని ఈ నెల 26న ఢిల్లీలో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గ్యార శేఖర్ కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో శుక్రవారం దీనికి సంభందించిన గోడ పత్రికను సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరశురాం నాయకత్వంలో దేశంలోని 29 రాష్ట్రాల నుండి అంబేద్కర్ వాదులు, విద్యావంతులు, కళాకారులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరెళ్ళ లింగస్వామి, జిట్ట స్వామి, దాసరి నర్సింహ్మా, కోనేటి ఎల్లయ్య, అజారుద్దీన్, గాదె ఎల్లేష్; జిట్ట మల్లేష్, బొల్గురి సైదులు, పాల రమేష్, జిట్ట శేఖర్, అన్వర్, గుండమల్ల శంకర్, ఎండి పాష, అవురెండి రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలకు కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** ఆశ వర్కర్లకు నెలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఆశ యూనియన్ అధ్యక్షురాలు వనం నిర్మల కోరారు.శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని మండల వైద్యాధికారి కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలను మూడవ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బడ్జెట్ సమావేశంలోనే ఆశలకు ఎన్ హెచ్ ఎం బడ్జెట్ను పెంచాలని కోరారు. ఈనెల 24న హైదరాబాదులో నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమముకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మమత , పద్మ , పుష్పమ్మ , కవిత , ధనలక్ష్మి , సైదమ్మ, గంగ, జ్యోతి,మమత,నాగమణి,కమలమ్మ , వసుమతి,వరలక్ష్మి,ధనలక్ష్మి, అలివేలు,లింగమ్మ , ఇందిరమ్మ,కమల,వసంత,సుజాత,రాణి,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జమిలి ఎన్నికలతో దేశం మరింత అభివృద్ధి




**ప్రజాపక్షం/యాదాద్రి :** రాజపేట మండలంలోని స్థానిక గెస్ట్ హౌస్‌లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమం యొక్క కార్యశాల ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా జిల్లా నాయకులు పాశం భాస్కర్ పాల్గొని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ జమిలి ఎన్నికల అభిప్రాయ సేకరణ కోసం మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవిధ్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశారన్నారు. జమిలి ఎన్నికలతో దేశం మరింత అభివృద్ధి పదంలో ముందుకు పోతుందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ అనుకూల కార్యక్రమాలకు ఎప్పుడు వ్యతిరేకంగా ఉంటుంది అన్నారు. దేశ స్వాతంత్రం తర్వాత జరిగిన ఎన్నికలు జమిలి పద్ధతిలోనే జరిగేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క అధికార దాహంతో ఆ జమిలి వ్యవస్థను విచ్చినం చేశారని తెలియచేశారు. పార్టీలకి అతీతంగా జమిలి ఎన్నికల పైన ఉన్న సందేహాలు నివృతం చేయాలని సూచించారు. వన్ నేషన్ వన్ ఎలెక్షన్‌తో దేశం ఆర్థిక పురోగతిని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల కన్వీనర్ చాపురం శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల నరసింగరావు, కంచర్ల శ్రీనివాస్ రెడ్డి గారు, బిజెపి ఎస్టి సెల్ రాష్ట్ర నాయకులు బుక్యా శ్రీను నాయక్ , జిల్లా కౌన్సిల్ మెంబర్ పుట్ట వీరయ్య దాచేపల్లి శ్రీనివాస్, బిజెవైఎం జిల్లా నాయకులు బూరుగు శేఖర్ రెడ్డి, రాజం నగేష్ యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మెండు భగవాన్ రెడ్డి, మండల బీసీ మోర్చా అధ్యక్షులు కాకళ్ల నవీన్, బిజెవైఎం మండల అధ్యక్షులు మార్క శివ, దిడ్డి సత్యనారాయణ, రాజపేట టౌన్ అధ్యక్షులు సాదబోయిన శంకర్, చిగుళ్ల బీరప్ప, జెన్నె సిద్ధులు, బిమాగాని శివ, బూరుగు వెంకట్, దండే సంపత్, రంగ నరేష్ గౌడ్, సంగెం వేణు, ఐరేని శ్రీధర్, పోచంగల్ల బాబు, ఉప్పరీ మల్లేశం, కోయ ఉపేందర్, బొమ్మగాని రవికుమార్, పిట్టల పోషయ్య పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి ఆశాల నిరసన

**ప్రజాపక్షం/చిట్యాలః** తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా శాసనసభలో సభ్యులు నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు శుక్రవారం నల్లగొండ జిల్లా చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశాల సంఘం జిల్లా కమిటి సభ్యురాలు గంగుల జయమ్మ మాట్లాడుతూ ఆశాలకు ఇస్తున్న వేతనాన్ని రూ. 18వేలకు పెంచేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు అందుతున్న జీతభత్యాలు ప్రస్తుతం ఉన్న ధరలకు ఏమాత్రం సరిపోవడం లేదని వాపోయారు. ఆశా వర్కర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచాలని జయమ్మ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాల నాయకులు పోశబోయిన సైదమ్మ, పుష్పలత, భాగ్యమ్మ, లక్ష్మి , రేణుక, నీరజ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి



**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** ఉపాధిహామి కూలీలకు ప్రభుత్వం రూ.600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడగోజు వెంకటాచారి ఆయన అన్నారు. శుక్రవారం మండలంలోని పూసలపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఉపాదిహామీ కూలీలను సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉపాదిహామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోని మాట్లాడారు. ఉపాదిహామీ పనులు జరిగే చోట కనీస వసతులైన టెంట్, ప్రాథమిక చికిత్స, తాగునీరు అందించాలన్నారు. ప్రభుత్వం ఉపాది కార్మికులకు కూలీ రూ.120, రూ.80 చెల్లిస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కూలీలకు రూ.600చెల్లించి ఆదుకోవాలన్నారు. దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, సైదమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, పుష్ప, పద్మ, సరస్వతి, రాంబాబు, వెంకట్‌రెడ్డి, సైదులు, పరమేష్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపానికి గుర్రై మహిళ మృతి

**ప్రజాపక్షం/మునుగోడు:** మహిళ మనస్థాపానికి గుర్రై పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన మండలంలోని జక్కల వారి గూడెం లో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన దోటి తిరుపత( 50) భర్త దోటి లింగయ్య వ్యవసాయం తోపాటు మేకలను కాసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు ఇటీవల కొంతకాలంగా సాదుకుంటున్న మేకలు వరుసగా మృతి చెందుతున్నాయి ఎంతో కష్టపడి మేకలను సాదుకుంటుంటే చేతి కాందే సమయానికి మేకలు మృతి చెందడం పట్ల తీవ్ర మనస్థాపానికి గుర్రైన తిరుపతమ్మ శుక్రవారం ఉదయం 6 గంటలకు పురుగుల మందు తాగింది గమనించిన కుటుంబ సభ్యులు నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భర్త దోటి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై ఇరుగు రవి తెలిపారు.

## 'డ్రంకెన్ డ్రైవ్' వాహనాల తనిఖీ



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో యాదగిరి గుట్ట ట్రాఫిక్ సిఐ ఎలగొండ కృష్ణ, యాదగిరిగుట్టరూరల్ సిఐ కొండల్ రావు ఆధ్వర్యంలో వాహనదారులకు డ్రంక్అండ్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలో పలు వాహనాలను ఆపి బ్రీథ్ ఎనలైజర్‌తో వాహనదారులను టెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజు, కానిస్టేబుల్లు సలీం, సురేష్, నరేష్, అనిల్, నితిన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## ముందస్తు అరెస్టు

**ప్రజాపక్షం/గుండాల;** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో శుక్రవారం ముదిరాజ్ సంఘం పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం లో భాగంగా నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది. అరెస్టు అయిన వారిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నాగారపు రమేష్, సిఐటియూసి నాయకులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'పై కార్యశాల




**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక బిజెపి కార్యాలయంలో శుక్రవారం వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై కార్యశాలను కన్వీనర్ మచ్చ వివాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య హాజరై వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో దేశానికి జరిగే మేలు, దాని వలన దేశానికి ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కో కన్వీనర్ తోటకూర శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షులు బుక్క చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శులు విజయ్‌భాస్కర్ రెడ్డి, అవినాష్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు రేణుక, సినియర్ నాయకులు పాల్గొన్నారు.

## సిఐ ఆదిరెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు సర్కిల్ సిఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆదిరెడ్డిని శుక్రవారం చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు , రాజకీయ పార్టీల నాయకులు ,మండల ప్రజలు శాంతిభద్రతల విషయంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండ్రపల్లి మాజీ సర్పంచ్ ,చండూరు ఏఎంసి డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలోని స్థానిక మస్జీద్ ఏ చౌక్ లా ఇఫ్తార్ విందు కార్యక్రమం ముజఫ్ఫార్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రంధాలయం చైర్మన్ అవైస్ చిస్తీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం చాల సంతోషకరం అని తెలిపారు. ఈ కార్యక్రమం సైఎద్ వాసిమ్ జావీద్, అక్తర్, మొయిన, నజీమ్, నాదీమ్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధార్థ డిగ్రీ పిజి కళాశాలలో 'గెట్ టు గెదర్' సంబరాలు




**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నల్లగొండ పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ , పిజి కళాశాలలో ఈ రోజూ ఘనంగా గెట్ టు గెదర్ పార్టీ ఏర్పాటు చేశారు, ముఖ్యా అతిది గా ప్రధాన ఆచార్యులు, అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ బెల్లి యాదయ్య పాల్గొని, విద్యార్థి జ్ఞనాన్ని పరీక్షించి, గురువులకు విద్యార్థులకు మద్యన ఉండే బోధన అంశాలపైన అవగాహన కల్పించారు. అదే విధంగా కళాశాల చైర్మన్ గుండెబోయిన లింగయ్య యాదవ్ మాట్లాడుతూ మంచి విద్యను అభ్యసించి ఉన్నత చదువులు చదివి సమాజంలో గౌరవం మంచి పేరు ప్రతిష్టలు తీసుక రావల్లన్నారు.కళాశాల ఆకాడమిక్ డైరెక్టర్ గుండెబోయిన జానయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివి ఉన్నతా శిఖరాలను చేరుకోవాలని కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దారా యాదగిరి,కళాశాల కరస్పాండెంట్ గుండెబోయిన రవికుమార్ యాదవ్ ,అద్యాపకులు జుబేర్, ఖాన్,యాదగిరి , శేఖర్,మల్లేష్ లక్ష్మణ్,రమ్య, సుకన్య,రమణ,విజయలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఆటపాటతో ఆకట్టుకున్నారు.

## ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** విద్యా ఉద్యో గ స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన సందర్భంగా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం నల్లగొండ లోని గడియారం సెంటర్లో జ్యోతిబాపూలే విగ్రహం వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణ య్య ఆధ్వర్యంలో బిసిలు చేస్తున్న పోరాటాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మునాస ప్రసన్నకుమార్ ,జిల్లా అధ్యక్షులు వంగూరు నారాయణ యాదవ్ ,గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## క్షయ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం




**ప్రజాపక్షం/ నల్లగొండ :** క్షయరహిత జిల్లా కోసం విద్యార్థిని విద్యార్థులు కృషిచేయాలని జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని క్షయనివారణ కార్యాలయంలో రివర్ నిమ్స్ సంయుక్తంగా సహాకారంతో టి.బి. నిర్మూలన, అవగాహన ముందు జాగ్రత్తలపై అన్ని జిల్లా స్థాయిలో నర్సింగ్, డిగ్రీ, పారామెడికల్ విద్యార్థినిలకు జిల్లా స్థాయిలో ముగ్గుల పోటీని అసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులలో జాతీయ క్షయనివారణ కార్యాక్రమం అవగాహన పెంచడం ప్రచారం కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. క్షయరహిత జిల్లా కోసం విద్యార్ధిని విద్యార్థులు కృషిచేయాలని ప్రజలలో అవగాహన కల్పించడం కోసం విద్యార్ధిని విద్యార్థుల ప్రయత్నం చేయాలని అయన విద్యార్థులను కోరారు. ఈ పోటీలో జిల్లాలోని వివిధ కళాశాలల నుండి 30కి పైగా టీంలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి డాక్టర్లు బ్లెస్సీ ఎస్తర్, రవి ప్రసాద్, సుధ బుసిరెడ్డి, రమేష్, హరిక్రిష్ణ, లావణ్య నల్లగొండ ఇన్సిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్ ముఖ్య అధికారి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంట్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయి వికాసిత భారత్ యూత్ పార్లమెంట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంజి యూనివర్సిటి ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ పసుపుల మద్దిలేటి, ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 127 మంది విద్యార్థులు ఒక నిమిషం వీడియో చేసి ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారని అన్నారు. నమోదు చేసుకున్న విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో జిల్లా నుండి పదిమందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జరుగుతున్న పోటీలకు పంపుతున్నామని అన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయిలో పాల్గొని పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తారని దాని కోసం రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు, సృజన తదితరులు పాల్గొన్నారు.



## హుండీ ఆదాయం లెక్కింపు

**ప్రజాపక్షం/చండూరుః** మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీ రామలింగేశ్వ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుండి 17 వరకు జరిగాయి. దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం అధికారులు లెక్కించారు. హుండీ ద్వార 3లక్షల 15వేల ,238 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ అంబటి నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గుండ్రెడ్డి రమ్యా రామలింగారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు బోయపల్లి రాములు గౌడ్, కురుపాటి వెంకటమ్మ, జిల్ల నర్సింహ్మా, కారువంగ నర్సింహ్మా శర్మ , పోలోజు సత్యనారాయణ చారి , మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు

**ప్రజాపక్షం/డిండి;** గద్వాల్ డోర్నకల్ రైల్వే అంచనా బడ్జెట్ రూ. 5,330 కోట్ల కేటాయింపు పట్ల భారత ప్రధాన మంత్రి నరేందర్ మోడీ కి బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల్ డోర్నకల్ మధ్య రైల్వే లైన్ భూ సర్వే పూర్తయిందని, రైల్వే లైన్ భూ సేకరణకు రూ. 5,330 కోట్లు అవసరం అవుతాయని, సికింద్రాబద్ సౌత్ సెంట్రల్ రైల్వే కేంద్రానికి నివేదిక అందించిందని అన్నారు. ఈ లైన్ పొడవు 296 కిమి కాగా గద్వాల్, నాగర్ కర్నూల్, కల్వకుర్తి, దేవరకొండ, సూర్యపేట మీదుగా డోర్నకల్ చేరనుంది. ఢిల్లీ నుండి సౌత్ ఇండియాలోని చెన్నై, తిరుపతి, తిరువనంతపురం వంటి ముఖ్య పట్టణాలకు వెళ్ల వచ్చని పూర్తికి సహకరించినందుకు మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

## నిజాయితీ గల అధికారిని సస్పెండ్ చేయడం విచారకరం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల రెవెన్యూ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీధర్ రాజకీయ ప్రోద్బలంతో కొంతమంది రియల్ ఎస్టేట్ అధికారులు తాసిల్దార్‌ను సస్పెండ్ చేయించడం బాధాకరమని సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర చైర్మన్ బంజారా సురేష్ గౌడ్ విచారణ వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో భూ బకాసురుడు నాన్నే స్టేట్ అధినేత ఎంతో మంది భూములను ఆక్రమించి ప్లాట్లు విభజించి విక్రయించారని, ప్రస్తుతము నాన్నే భూముల వ్యవహారంలో ఇంకా అక్రమాలు జరుగుతున్నాయని, అక్రమాలపై రాష్ట్ర హైకోర్టు జడ్జి చేత లేదా సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని, అక్రమాలకు గురైన వారికి తగు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇఫ్తార్ విందు ఏర్పాటు



**ప్రజాపక్షం/మోటకొండూరు :** పవిత్ర రంజాన్ మాసంలో మోటకొండూరు మండలంలోని చాడ గ్రామపంచాయతీ పరిధిలోని మసీదు లో సుమారు 150 మంది ఉపవాసాలు ఉండే ముస్లిం సోదరులకు కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ముస్లిం సోదరులు చాడ మజీదుకు కౌంపాండ్ వాల్ నిర్మాణానికి సహకరించాలని కోరగా తప్పకుండా కౌంపౌండ్ వాల్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, మాజీ ఎంపి పివీసం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేమ్మాని సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ శర్మ, శ్రీనివాస్ రెడ్డి, విఠల్ రెడ్డి, రాంరెడ్డి, శశిదర్ రెడ్డి,ఆకుల శ్రీనివాస్, మహమ్మద్ పాషా, ఇసూబ్, ఆబిద్, ఉస్మాన్, మహమూద్, బురాన్, బషిర్ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



**ప్రజాపక్షం/నందికొండ:** పదో తరగతి పరీక్షలు శుక్రవారం మొదటిరోజు నందికొండ మున్సిపాలిటీలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక హిల్ కాలనీ లో మొత్తం రెండు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 317 మంది విద్యార్థులకు గాను 317 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాల పరీక్ష కేంద్రంలో 200 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 117 మంది విద్యార్థులు పరీక్ష వ్రాసారు. ఉదయం 9.30గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. 8గంటల 45నిమిషాల నుంచి విద్యార్థులను లోనికి అనుమతించడంతో కేంద్రాల వద్ద విద్యార్థులు హాల్ టికెట్లను పరిశీలించుకున్నారు. అనంతరం విద్యార్థులను క్షుణంగా పరిశీలించిన అనంతరం లోనికి అనుమతించారు.ఎంఈవో శ్రీనివాస్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకున్నారు.



**ప్రజాపక్షం/ హాలియా:** పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అనుముల మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 688 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ గుండా కృష్ణమూర్తి తెలిపారు. పరీక్ష కేంద్రాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు ఆయన చెప్పారు. హాలియాలోని జెడ్పి ఉన్నత పాఠశాల, నిర్మల ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, కేరళ మోడల్ స్కూల్ లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండల వ్యాప్తంగా మొదటిరోజు 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. పోచంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాలలో శుక్రవారం విద్యార్థులు తెలుగు సబ్జెక్ట పరీక్ష రాశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కేటాయించిన 200 మంది విద్యార్థులకు గాను 119 మంది విద్యార్థులు హాజరయ్యారు. కృష్ణవేణి పాఠశాలలో 187కు, బాలికల పాఠశాలలో 155కు ఎలాంటి గైర్హాజరు లేకుండా విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరెండెంట్లు తెలిపారు. మోత్కూరు ఎంఈఓ టి.గోపాల్ రెడ్డి స్క్వాడ్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



**ప్రజాపక్షం/ నాంపల్లి:** నాంపల్లి మండల పరిధిలోని రెండు పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పెద్దాపురంలో నీ ఆదర్శ పాఠశాలల్లో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా రెండు పరీక్ష కేంద్రాలలో మొత్తం 345 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా ఒక విద్యార్థి మినహా 344 మంది పరీక్షలకు హాజరయ్యారని మండల విద్యాధికారి మల్లికార్జున రావు తెలిపారు.

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** పదో తరగతి పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా



ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 7663 మంది ఉన్నారు. వీరి కోసం జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు 7625 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కాగా 38 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించే ముందు వారిని తనిఖీలు చేసి పంపించారు. దీంతో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ ధరించిన విద్యార్థుల చేతి నుంచి వాటిని తొలగించి పరీక్షా కేంద్రంలోని పంపించారు. పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధించడంతో పాటు పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయించారు.

**ప్రజాపక్షం/ఉండవెల్లిః** పదవ తరగతి పబ్లిక్ శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని మూడు సెంటర్ల యందు నాలుగు వందల మంది విద్యార్థిని విద్యార్థులు మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహణ చేపట్టారు. 9 గంటలకి విద్యార్థులని గదిలో ప్రవేశించి తనిఖీలు చేపట్టారు. అధికారులు పగడ్బందీగా పరీక్షలు నిర్వహణకు తగు చర్యలు తీసుకున్నట్లు మండల విద్యాధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులకు మొత్తం విద్యార్థులు హాజరైనట్లు ప్రాథమిక పాఠశాలలో 133 మంది విద్యార్థులు గాను 131 హాజరైనట్లు మైనార్టీ గురుకులంలో 133 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు తెలిపారు.



## మండల తహసీల్దార్ సస్పెన్షన్



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల రెవెన్యూ తహసిల్దార్ ఎం.శ్రీధర్ ను శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హను మంతరావు సస్పెండ్ చేసినట్లు వెలుగులోనికి వచ్చింది. వివరాల్లోనికి వెళితే మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో ఫీల్డ్‌లో ఉన్న ఫ్లాట్లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా పాసు బుక్ డేటా కరప్షన్ ద్వారా పాసు బుక్కు జనరేషన్‌కు బాధ్యులైన తాసిల్దార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## భక్తులకు హెల్త్‌క్యాంపు

ప్రజాపక్షం/ఎర్రవల్లిః కర్ణాటక మహారాష్ట్ర నుండి శ్రీశైలం కు వేలాది భక్తులు కాలినడకన వెళ్తున్నారు. అయిజ మండలం వెంకటాపురం స్టేజిలో అయిజ డాక్టర్ విష్ణు పరివేక్షణలో హెల్త్ క్యాంపు భక్తుల వైద్య సేవ కోసం ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు మందులు ఇవ్వడం జరిగింది.

## ఉపాధి పనులు పరిశీలన



**ప్రజాపక్షం/ఉండవెల్లిః** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జోగులాంబ గద్వాల జిల్లా అడిషనల్ కలెక్టర్ డిఆర్‌డిఎపిడి నర్సింగరావు ఆకస్మాత్తుగా పనులను పరిశీలించారు. శుక్రవారం మండల పరిధిలోని ఏ బూడిదపాడు గ్రామంలో జరిగిన ఉపాధి పనులను నాణ్యత ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి చెందారు. గ్రామంలోని కాటిల్ షెడ్ రూఫ్ ఆర్వెస్టింగ్ పనులు బండింగ్ రూపు ఇతర పనులు పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి పనులపై ఆరా తీశారు. గ్రామ అభివృద్ధి కోసం ఉపాధి పనులు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. నీటి సమస్యలు గ్రామంలోని సమస్యలను వంటి పనులను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి తిరుపతి, ఏపీవో సౌజన్య టిఏ అసిస్టెంట్లు పంచాయితీ కార్యదర్శి మహేష్, స్థానికులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యకు ఎంపికైన విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** విదేశీ విద్యకు ఎంపికైన విద్యార్థినిని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అభినందించారు. వెనుకబడిన వర్గాలోని పేద విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపూలే వీదేశీ విద్యా పథకం ఒక వరం. విదేశాల్లో పీజీ కోర్సులు చదివేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి వెనుకబడిన వర్గాలకు చెందిన 60 మంది విద్యార్థులను సెలక్షన్ చేయగా జోగులాంబ గద్వాల జిల్లా పట్టణ పద్మశాలి కులానికి చెంఇన చేనేత కార్మికుడు అక్క శాంతారాం కుమార్తె అక్కల ప్రియాంక విదేశీ విద్య పథకం కింద సెలక్షన్ కావడం అభినందనీయమన్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే ఓవర్సీస్ విద్యానిధి బీసీ వర్గాలకు విదేశీ విద్య పథకం కింద సీటు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి విద్యార్థిని తల్లి దండ్రులు ధన్యవాదములు తెలిపారు. న్యూయర్క్ నందు మాస్టర్ ఆఫ్ సైన్సు రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున 20 లక్షలు స్కాలర్షిప్ ప్రభుత్వం భరిస్తున్నందుకు నాలాంటి బీద, బడుగు బలహీన వర్గాల బీసీ కులానికి చెందిన చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఉన్నత చదువులకు విదేశాలలో చదవడానికి చేయూతనిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కి ధన్యవాదాలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, బీద కులాలకు చేయూతనిచ్చే నాయకుడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అని విద్యార్థిని అక్క ప్రియాంక తెలిపారు.



## దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్న మోడీ ప్రభుత్వం

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు, సమాజానికి ఎలాంటి ఉపయోగం లేని విధానాలను అవలంభిస్తూ ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక పేరుతో ప్రజల మధ్య ఐక్యత లేకుండా విద్వేషాలు రెచ్చగొడుతూ దేశాన్ని మధ్య యుగాల వైపు తీసుకెళ్తున్నాడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్‌లో సిపిఎం జిల్లా కమిటిలోని మండల కార్యదర్శుల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పోరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చే విధంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. బిజెపియేతర రాష్ట్రాలపై కక్షగట్టి అభివృద్దిక నిధులు ఇవ్వకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను అప్రతిష్టపాలు చేస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, వెంకన్న, జె.నర్సింహరావు, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, పల్లె వెంకట రెడ్డి, షేక్ యాకుబ్, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, పాండునాయక్, ఎం.ముత్యాలు, బెల్లంకొండ సత్యనారాయణ, జూలకంటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







## హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/చండూరుః** గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రేస్ పార్టీ మునిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చండూరులోని శీల అనసూయ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికే పరిమితమయ్యారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలే కట్టవలసి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ లో మాట్లాడటం చూస్తుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజేయులు , పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్, జాయింట్ కన్వీనర్ కాసాల జనార్ధన్‌రెడ్డి, నాయకులు బొబ్బల మురళి మనోహర్ రెడ్డి, యువమోర్చ రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి పాల్గొన్నారు.

# చారిత్రక విజయాలు సాధించాం




**-ఉద్యమాల గుమ్మం ఖమ్మం**
**-ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యోగ జెఎసి ఛైర్మన్ లచ్చిరెడ్డి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వ అండతో అనతికాలంలోనే చారిత్రక విజయాలు సాధించామని తెలంగాణ ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. ఎన్నో చారిత్రక పోరాటాలకు జాతీయ స్థాయి ఉద్యమాలకు పురుడుపోసుకున్న ఉమ్మడిఖమ్మంజిల్లా వేదిక నుండి తెలంగాణ ఉద్యోగ జేఏసి తన ఆత్మీయ సమ్మేళనం, సమావేశాల విజయ యాత్రను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంద న్నారు. శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రి వర్గం, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారుల సహకారంతో అనతి కాలంలోనే చారిత్రక విజయాలు సొంతం చేసుకున్నామన్నారు. 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించడం, గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తేచ్చేందుకు గ్రామానికి ఒక అధికారిగా 10,954 పోస్టుల ఏర్పాటు అతిపెద్ద విజయాలని లచ్చిరెడ్డి తెలిపారు.రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాల్లో పోస్టుల మంజూరు జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకు పదోన్నతులు సాధించడం, తహసీల్దార్లు, ఆర్డివోలు, జేసిలు గతంలో కోల్పోయిన అధికారాలను భూ భారతి చట్టంతో పునరుద్ధరణ చేయడం జరుగుతుందన్నారు. పూర్వ విఆర్ఏ, విఆర్‌వోలను ఆప్షన్ పద్ధతిలో తిరిగి మాతృశాఖలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుకోవడం జరిగింద న్నారు. ఈ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, టిజీటిఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రాములు, రమేష్ పాకా, టిజీటిఏ సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహారావు, మంగీలాల్, తుమాటి శ్రీనివాస్, కోట రవికుమార్, అశోక్‌కుమార్, భద్రునాయక్, గుండు రాజులు, జాదవ్ మాణిక్యరావు, ప్రతాప్, అభిరామ్,మురళి, బానాల రాంరెడ్డి, వి. భిక్షం, గరికె ఉపేంద్రరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వేసవిలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని అజయ్ తండా లో భూక్యా రుక్మిణీ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలి వేంద్రం ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో అనేక మంది యువత, స్వచ్ఛంధ సంస్థలు సామాజిక సేవలో దూసుకెళ్తున్నారని పేర్కొన్నారు. రుక్మిణీ కుటుంబ సభ్యులు గ్రామంలో వేసవి లో తాగునీటి ని



అందించేందుకు ముందుకు రావటం సంతోషం అన్నారు. ఈ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, పంచాయతీ కార్యదర్శి ఆవుల నవ్య, కుటుంబ సభ్యులు సిఐఎస్ఎఫ్, ఏఎస్ఐ భూక్యా రామకృష్ణ, బి.సుశీల, భద్రమ్మ, భాస్కర్ రావు, పద్మ, మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ సక్రునాయక్, మాజీ సర్పంచ్ పార్వతి బాయి. గ్రామ పెద్దలు టి.నరేష్, రామోజీ, బి.రామారావు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన గుర్తుతెలియని దుండగులు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇంటి వద్ద ఉన్న బైక్ ను గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోకి తీసుకెళ్లి తగలబెట్టిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి గ్రామానికి చెందిన గోగుల రామారావు అనే వ్యక్తి కి చెందిన ద్విచక్ర వాహనం ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్ర



వారం తెల్లవారుజామున దగ్ధం చేశారు. ఇంటి వద్ద ఉన్న బైక్ ను గ్రామ శివారు వరకు తీసుకెళ్లి, దగ్ధం చేయటంతో గ్రామస్తులు బంగుతింటు న్నారు. బైక్ ను ఇంటి నుంచి తీసుకెళ్లి దగ్ధం చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది. పాతకక్షల నేపధ్యంలో ఎవరైనా కావాలనే ఉద్దేశ్యంతోనే చేశారా... లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది. కాగా బాధితుడు రామారావు గత రెండు రోజుల క్రితం పాము కాటుకు గురై ఖమ్మం హాస్పిటల్ లో చికిత్స పొందుతు న్నారు. గ్రామంలో బైక్ దగ్ధం విషయం తో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఇంటిలో ఉన్న బైక్లకు భద్రత లేదా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో బైక్ దగ్ధం తో భయంతో వణికిపోతు న్నారు. పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని వివరాలు సేకరించారు. మొత్తం మీద నాచేపల్లి బైక్ దగ్ధం గ్రామంలో ఉలిక్కిపడ్డారు.

# రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

**-భర్తకు గాయాలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్ర వారం చోటుచేసుకుంది. వివ రాల్లో కెళితే... సత్తుపల్లి పట్టణా నికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త అడపా రాజేంద్రప్రసాద్,



పుష్పావతి దంపతులు కారులో అశ్వారావుపేట గుడికి వెళ్ళి తిరిగి వస్తుండగా బేతుపల్లి గ్రామం వద్ద సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపుగా వెళ్తున్న పాల వ్యాన్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. తక్షణమే చుట్టుపక్కల వారు క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించే లోపే అడపా పుష్పావతి (55) మరణించినట్లు వైద్యులు తెలిపారు. రాజేంద్రప్రసాద్ కు గాయాలయ్యాయి. వీరి కుమార్తె హర్షిణి కి గత శనివారమే వివాహం జరగ్గా పెళ్లింట విషాదం నెలకొంది. మృతురాలిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డా.దయానంద్ పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నిరుద్యోగ యువకులను మోసం చేస్తున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం పేరుతో నిరుద్యోగ యువకులను దగ చేస్తుందని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) పాలేరు నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



రాజీవ్ యువ వికాస పథకం కు దరఖాస్తు చేసుకోవాలి అంటే రేషన్ కార్డు తప్పనిసరి అని కానీ ప్రభుత్వం ఏర్పడి నేటి వరకు రేషన్ కార్డులు జారీ చేయలేదని ఆరోపించారు. గత 11 సంవత్సరాలు గా యువకులకు రేషన్ కార్డులో పేరు కూడా లేదు ఇలాంటి తరుణంలో యువత ఎలా దరఖాస్తులు చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే చాలా తక్కువ మందికి దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని తెలిపారు. రేషన్ కార్డు లేని నిరుద్యోగ యువకుల గురించి ప్రభుత్వం తెలపాలి అని అన్నారు. రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులు రేషన్ కార్డులు లేని వారు కూడా కల్పించే విధంగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని అయన డిమాండ్ చేశారు.

# ఆదివాసీలకు వైద్య శిబిరం

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య బృందం శాంతినగర్ శివారు అటవీ ప్రాంతంలోని చత్తీష్‌ఘడ్ ఆదివాసీలు నివసించే ఏమైనా రజబలి నగర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వర పీడితులకు



మలేరియా రాపిడ్ టెస్ట్ చేసి ఫలితాలను నిర్ధయించి వెంటనే చికిత్సలను ప్రారంభించారు. గర్భిణీ స్త్రీలకు పరీక్షించి తగిన సలహాలు మందులు అందించారు. దోమల నివారణకు గాను ఫోకల్ స్ప్రే చేశారు. ఈసందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ వేసవి కాలంలో వడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళలు పురుషులు ఎక్కువ సమయం ఎండలో పని చేయకుండా నీడ పట్టున పని చేయాలన్నారు. పిల్లలకు ఎక్కువగా నీరును తాగించాలని, చిన్న పిల్లలకు వేసవికాలంలో వాంతులు, విరోచనాలు అయితే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రకాశరావు, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్, ఆరోగ్య కార్యకర్తలు ప్రేమలత, జ్యోతి, ఆశ కార్యకర్త సీతమ్మ, శంకర్ పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా స్థాయిలో ఎంసెట్ మోడల్ పరీక్ష

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత అయిదు సంవత్సరాలుగా ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో టాప్ కాలేజ్‌ల్లో సీట్లు సాధిస్తున్న స్థానిక సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో జరగబోయే ఎంసెట్ ప్రవేశ పరీక్ష వ్రాయబోవు విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించుటకు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఈ ఎంసెట్ మోడల్ పరీక్షను భద్రాద్రి జిల్లా స్థాయిలో ఈనెల 23 ఆదివారం ఉదయం 9గంటలకు బ్రిలియంట్ కాలేజ్ సారపాక నందు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ బిఎన్ ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంసెట్‌కు అప్లై చేసి ఏప్రిల్‌లో పరీక్ష వ్రాయు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ మోడల్ పరీక్షలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు అన్నారు. ఈ మోడల్ పరీక్ష వ్రాయు విద్యార్థులు ఒక రోజు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ సారపాక నందు సెల్ 9866283566, 9705137128ను సంప్రదించాలన్నారు.



# వైభవంగా బోనాల ప్రదర్శన

**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి మహిళలు, భక్తులు, గ్రామస్తులు శుక్రవారం భారీగా బోనాలు సమర్పించారు. ఇటీవల తాళ్లగూడెంలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. ఆ రోజు నుండి ఎంతో నిష్ఠతో



పూజలు చేసిన ఆ గ్రామ ప్రజలు, మహిళలు 16 రోజుల పండగ సందర్భంగా గ్రామంలో మహిళలు బోనాలు, ఎత్తుకొని మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గోపయ్య సమేత లక్ష్మీ తిరుతపమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మొక్కులు కూడా చెల్లించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుడికి మంత్రి పొంగులేటి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కారేపల్లి:** బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు సాదిక్ అలి గత పది రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స పొంది ఇంటి వద్ద ఆర్థిక ఇబ్బందిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్ చేసి ఆర్థిక సహాయం చెయ్యాలని సాధిక్ ఆలి కోరడంతో స్పందించి మంత్రి పొంగులేటి ఏమి ఇబ్బంది పడమాకూ



పెద్దాయన అని సాదిక్ అలికి ధైర్యం చెప్పి, వెంటనే మంత్రి పొంగులేటి స్థానిక నాయకుడు ఇమ్మడి తిరుపతిరావుకు రూ 10వేలు పంపించి ఆర్థిక సహాయం చేయమని ఆదేశించారు. శ్రీనన్న తన మనుషులతో 10వేల రూపాయలు పంపినందుకు సాదిక్ ఆలి మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు, ఎండి యాకుబ్, తోగూర శ్రీను, ఎస్‌కే మజీద్ పాషా, అద్దెల రామారావు తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలు ప్రశాంతం

**ప్రజాపక్షం/చింతకాని :** పదో తరగతి వార్షిక పరీక్షలు చింతకాని మండలంలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభం కానుండగా విద్యార్థులు సుమారు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలి వార్షిక పరీక్ష కావడంతో విద్యా



ర్థులు తమకు ఇష్ట దైవాలకు పూజలు చేయడంతో పాటు తమ హాల్ టికెట్లకు సైతం ప్రత్యేక పూజలు చేయించుకొని పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.చింతకాని మండల వ్యాప్తంగా 3 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 490 మంది విద్యార్థులకు గాను 490 మంది హాజరయ్యారు. నూరు శాతం హాజరు నమోదైనట్లు ఎంఈవో వీరపనేని శ్రీనివాసరావు తెలిపారు.